
సాక్షి
మహబూబాబాద్
ఆదివారం | 4 | ఆగస్టు | 2024



వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)



నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం

- చదువుకున్న రోజుల్లో వారంతా స్నేహితులు
- ఎక్కడెక్కడో స్థిరపడినా మర్చిపోని నాటి స్నేహం
- తలా కొంత పోగేసుకుని ఆపన్నహస్తం

వారంతా చదువుకునే రోజుల్లో స్నేహితులు. ప్రాథమిక, ఉన్నత విద్య పూర్తిచేసిన వారు కొందరైతే.. కొంతవరకు చదివి వారికి నచ్చిన రంగాల్లో ఉపాధి పొందుతున్న వారు మరి ఇంకొందరు.. ఎవరి జీవితాలు వారివి.. అయినా స్నేహ బంధాన్ని మరువలేదు. కష్టాల్లో ఉన్న నాటి స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. అప్పటి అనుబంధాన్ని పంచుకుంటున్నారు.. ప్రమాదవశాత్తు స్నేహితుడు మరణించినా.. కష్టాల్లో ఉన్నా ఆ కుటుంబానికి 'మేమున్నాం' అంటూ అండగా నిలబడుతున్నారు. తమ అ'పూర్వ స్నేహబంధం' తెగిపోనిదంటూ నిరూపిస్తున్నారు. నేడు(ఆదివారం) ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా అలాంటి అపూర్వ స్నేహితులపై ప్రత్యేక కథనాలు.

అపూర్వ స్నేహితులు

ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ భరోసా

ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక చేయూత..

ఖానాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97 సంవత్సరం పదో తరగతి చదివిన వారు ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సాయం చేస్తున్నారు. పూర్వవిద్యార్థి వీరమనేని సాగర్‌రావుకు వచ్చిన ఆలోచనతో ఆర్థిక నిధి సమకూర్చుకుంటున్నారు. పదో తరగతి పూర్వవిద్యార్థులతోపాటు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివిన సుమారు 60 మందితో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. అందులో నిరుపేదలు సైతం ఉండడాన్ని గమనించారు. వారి ఇళ్లలో జరిగే ఆడపిల్లల వివాహానికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. అడ్మిన్‌గా ఉన్న సాగర్‌రావు విషయాన్ని గ్రూపులో పోస్టు చేస్తే.. సభ్యులు తమకు తోచినంత అందించి వివాహ సమయంలో అందజేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.ఐదు లక్షల నగదుతోపాటు బంగారం అందజేసి 'స్నేహమంటే ఇదేరా' అని నిరూపించారు. స్నేహానికి కొత్త నిర్వచనాన్ని చెబుతున్నారు.

మిత్రుడికి అనారోగ్యం.. ఆదుకున్న సహచరులు



కాజీపేటలో తిరుమల్‌రావుకు ఫిజియోథెరపీ అందిస్తున్న మిత్రుడు (ఫైల్)

కాజీపేట: కాజీపేట పట్టణం అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన తిరుమల్‌రావు 2002–03 సంవత్సరంలో విద్యానగర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివాడు. కొద్దికాలం క్రితం పక్షవాతం రావడంతో సరైన వైద్యం చేయించుకునే పరిస్థితులు లేక మంచానికే పరిమితమయ్యాడు. భార్య, ముగ్గురు ఆడపిల్లలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న స్నేహితులు, అప్పటి గురువు పెరుమాండ్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో ఒకటిగా వెళ్లి తిరుమల్‌రావు ఆరోగ్య పరిస్థితిని చూసి చలించిపోయారు. కొంత నగదు అందించడంతోపాటు ఫిజియోథెరపీ డాక్టర్‌తో మాట్లాడి ఉచితంగా వైద్యం, మందులు అందేలా సాయం చేశారు. అప్పటి ఎమ్మెల్యేకు తిరుమల్‌రావు ఆరోగ్య పరిస్థితి వివరించి బీసీ బంధు కింద రూ.లక్ష అందేలా చేశారు.

స్నేహపూర్వక సాయం..



రేగొండ: పూర్వ విద్యార్థుల సమ్మేళనం అంటే ఒకప్పుడు సాంస్కృతిక సందడికే పరిమితమయ్యేది. కొద్దికాలంగా తమ తోటి స్నేహితులు ఆపదలో ఉన్నారంటే కూడా సమ్మేళనమై ఆపన్నులను ఆదుకోవడం వంటివి చేస్తూ.. కొత్త పంథాలో సాగుతున్నారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో 2006–07 సంవత్సరం పదో తరగతి చదివిన బృందం తమ తోటి స్నేహితురాలు కిడ్నీ సమస్యతో బాధపడుతోందని తెలుసుకుని డయాలసిస్ కోసం రూ.50 వేలు సాయం చేసింది. ఆమె ఇటీవల చనిపోవడంతో స్నేహితురాలి పిల్లలకు విద్య, వైద్యం కోసం రూ.50వేలు అందజేశారు.



స్నేహితుడికి ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందిస్తున్న 1998-99 బ్యాచ్ మిత్రులు (ఫైల్)

ఆపత్కాలంలో చేయూత

గూడూరు: చిన్నప్పటి నుంచి తమతో కలిసి చదువుకున్న స్నేహితులు కష్టాల్లో ఉన్నారని తెలుసుకుని తలా కొంత డబ్బు పోగేసుకొని ఆ కుటుంబాలకు అందించి భవిష్యత్‌లోనూ అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన పాన్నోజు ప్రశాంత్ భార్య మమత అకాల మృతి చెందింది. ప్రశాంత్ నిరుపేద కుటుంబానికి చెందినవాడు కాగా.. వారికి ఒక సంవత్సరం పాప ఉంది. విషయం తెలుసుకున్న 1998–99 పదో తరగతి విద్యార్థులు తమ స్నేహితుడికి అండగా నిలిచి సొంత ఖర్చు సుమారు రూ.50 వేలతో ఆమె దహన సంస్కారాలతో పాటు దశదిన కర్మ నిర్వహించారు. అనంతరం మిత్ర బృందం ప్రశాంత్ కూతురు పేరు మీద రూ.లక్ష పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందించారు. ఎప్పుడు ఏ కష్టం వచ్చినా బాసటగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆడపిల్లలకు అండగా..



కేసముద్రం: బాల్యమిత్రుడు మృతి చెందగా, ఒంటరైన అతడి ఇద్దరు కూతుళ్లకు అండగా నిలుస్తూ, పెద్ద కుమార్తెను చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు కేసముద్రం మండల కేంద్రానికి చెందిన ఎస్‌వీవీ హైస్కూల్‌కు చెందిన 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ బాల్య మిత్రులు. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గాండ్ల అశోక్‌కు ఇద్దరు కూతుళ్లు. మొదటి భార్యకు కూతురు పుట్టగానే ఆమె చనిపోగా, రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు మరో కూతురు జన్మించగానే అశోక్ చనిపోయాడు. తండ్రిని కోల్పోయిన ఆ ఇద్దరు చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తన ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్పందించారు. అదే సంవత్సరం ఇద్దరు కూతుళ్ల పేరు మీద సుకన్య సమృద్ధి యోజన కింద ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. బాల్యమిత్రులు రూ.45 వేల ఫీజు చెల్లిస్తూ శివానిని చదివిస్తున్నారు. స్నేహమంటే సంతోషంలోనే కాకుండా.. కష్టంలోనూ పాలుపంచుకోవడమని ఆ బాల్యమిత్రులు రుజువు చేస్తున్నారు.

జీవన పోరాటానికి భరోసా



స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన సాంబారి శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. సికింద్రాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అప్‌అండ్ డౌన్ చేస్తుండేవాడు. 2014 మార్చిలో సికింద్రాబాద్‌కు వెళ్లి రైల్లో తిరిగి వస్తుండగా.. ప్రమాదవశాత్తు రైలు కిందపడి రెండు కాళ్లను కోల్పోయాడు. దీంతో పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబానికి ఆర్థికంగా పెద్ద దెబ్బే తగిలింది. జీవనోపాధి కష్టమైంది. వైద్య ఖర్చులకు డబ్బులు లేని పరిస్థితి. విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు తమవంతుగా రూ.84 వేలు సేకరించి బాల్య మిత్రుడు మంగు వేద ప్రకాశ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

న్యూస్‌రీల్

అభివృద్ధికి నోచుకోని మానుకోట



నెహ్రూసెంటర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహబూబాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ పట్టణ సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా మున్సిపాలిటీలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. మున్సిపల్ చట్టాన్ని 2019 తీసుకువచ్చి మున్సిపల్ పాలకవర్గ హక్కులను హరించే విధంగా ప్రయత్నాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు పార్టీ నాయకులు, శ్రేణులు చేయూతనందించాలని కోరారు. ఈసమావేశంలో అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్,మాలోత్ రవీందర్, తోట రాజకుమారి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: విద్యుత్ సమస్యల పరిష్కారం, ఫీడర్‌లైన్ మీద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో నేడు (ఆదివారం) కొత్త బజారులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్యశ్రీ శనివారం తెలిపారు. పులిగోపాల్‌నగర్, రెడ్డి బజార్, బంధం చెరువు రోడ్, ప్రభుత్వ ఆస్పత్రి, కురవి గేట్ ఏరియా, సాలార్‌తండా, అయ్యప్పనగర్‌లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్బరీసాగుతో అధిక లాభాలు



నెల్లికుదురు: మల్బరీ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. మండల కేంద్రానికి చెందిన రైతులు పాము సరస్వతి, జనార్దన్ మల్బరీ క్షేత్రంలో శనివారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారులతో మల్బరీ సాగుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ పంట మార్పిడి చేసి మల్బరి విస్తరణకు నిత్యం అందరు పని చేయాలన్నారు. మల్బరీ సాగుపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మల్బరి సాగుపై రైతులను పోత్సహించి నెలనెలా స్థిరమైన ఆదాయం పొందే విధంగా రైతులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సరస్వతి, జనార్దన్, అధికారులు రాజయ్య, వెంకన్న, మమత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

నెహ్రూసెంటర్: స్వచ్ఛదనం, పచ్చదనం ప్రారంభ కార్యక్రమం ఉన్నందున రేపు (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వినతులను ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

బస్సెక్కండి.. బహుమతి పొందండి



తొర్రూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ప్రత్యేక బహుమతులు ఇస్తున్నామని తొర్రూరు డీఎం పద్మావతి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని బస్టాండ్‌లో శనివారం ఆర్టీసీ లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు, బాలికలు, యువతులు తమ టికెట్ వెనక భాగంలో పేరు, ఊరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లోని గిఫ్ట్ బాక్సుల్లో లేదా డ్రైవర్ వెనక సీటులోని డ్రాప్ బాక్సుల్లో వేయాలన్నారు. ప్రతీ 15 రోజులకోసారి డ్రా తీసి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఐ రజిత, కంట్రోలర్ ఆర్ ఎస్ కుమార్, ఏడీసీ ఎంకే రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- రూ.64 లక్షల విలువ గల 256 కిలోల గంజాయి పట్టివేత
- రెండు కార్లు,మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- అధికారులకు రివార్డులు..
- వివరాలు వెల్లడించిన కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: పెద్ద మొత్తంలో కారులో గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారినుంచి రూ.64 లక్షల విలువ గల 256 కిలోల గంజాయి, రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. నిందితులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడుకు చెందిన బానోతు బాబు కుమారస్వామి, నస్పూరి కుమారస్వామిలు అరెస్టు కాగా మహబుబాబాద్‌కు చెందిన జిలేందర్, భూపాలపల్లికి చెందిన అంగోతు రాజేందర్, ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా డొంకరాయికి చెందిన ముకుంద్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు. ప్రధాన నిందితులు బానోతు బాబు కుమారస్వామి, నస్పూరి కుమరస్వామిలు కారు డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్న క్రమంలో మిగితా నిందితులతో పరిచయం ఏర్పడినట్లు సీపీ తెలిపారు. వీరంతా సులభంగా డబ్బులు సంపాదించాలని, ఇందుకు గంజాయి రవాణాను ఎంచుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని డొంకరాయి పరిసర ప్రాంతాలనుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేవారన్నారు. డొంకరాయిలో నిందితుడు ముకుంద్‌తో కలిసి 256కిలోల గంజాయిని కొనుగోలు చేసి, దానిని రెండు కిలోల చొప్పున 128 ప్యాకెట్లుగా చేసి, కారుల్లో భద్రపరిచి డొంకరాయి నుంచి భద్రాచలం మీదుగా మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. నర్సంపేట కమలాపురం క్రాస్‌లో టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా కార్లను అడ్డగించారన్నారు. తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభించినట్లు సీపీ తెలిపారు. నిందితుడు బానోతు బాబు కుమరస్వామిపై గతంలోనూ గంజాయి కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. కమిషనరేట్‌ను గంజాయి ఫ్రీగా మార్చే ప్రయత్నంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అధికారులకు రివార్డులు...

గంజాయిని పెద్ద మొత్తంలో పట్టుకున్న అధికారులకు రివార్డులు అందజేస్తామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, రవికుమార్, నర్సంపేట ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి, టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్సైలు శరత్‌కుమార్, భానుప్రకాశ్, ఖానాపూర్ ఎస్సై రఘుపతి , ఏఏఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు సురేష్, మహబుబ్‌పాషా, సాంబరాజు, రాజేష్, శ్రీనివాస్, సురేందర్, శ్రవణ్‌కుమార్, నాగరాజులను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- సీసీఎల్ఏ నవీన్ మిట్టల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

నెహ్రూసెంటర్: పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ అన్నారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, అదనపు కలెక్టర్లతో సీసీఎల్ఏ కమిషనర్ శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై ఆగస్టు 23వ తేదీ వరకు ప్రజలకు తమ అభిప్రాయాలను సీసీఎల్ఏ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీసీఎల్ఏ.తెలంగాణ.గౌట్.ఇన్ ద్వారా సమర్పించాలని సూచించారు. కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును పరిశీలించి క్షేత్రస్థాయిలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని తెలిపారు. కొత్త చట్టం ద్వారా రికార్డు రూపకల్పన, రికార్డుల సవరణకు అవకాశం ఉందని,సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి వెసులుబాటు కల్పించిందన్నారు. మరోమూడు వారాల వ్యవధిలో పూర్తి స్థాయిలో ధరణి దరఖాస్తులు పరిష్కారమయ్యే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్,ఆర్డీఓలు ఎల్. అలివేలు, నరసింహారావు,తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం రాబోయే మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఎల్ఆర్ఎస్‌పై జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, మార్చి 2025 వరకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తులపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఎల్ఆర్ఎస్ కింద 25,70,708 దరఖాస్తులు రాగా 4,28,832 దరఖాస్తులను స్క్రూటినీ చేసి 60,213 దరఖాస్తులను ఆమోదించి భూములను క్రమబద్ధీకరించామన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, జెడ్పీ సీఈఓ నర్మద, మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి నరసింహామూర్తి, పంచాయతీ అధికారి హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, ఈఈలు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయాలి

దోర్నకల్: ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ నర్మద కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో సీఈఓ పాల్గొని మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే స్వచ్ఛదనం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. సమావేశానికి కొంతమంది గ్రామ ప్రత్యేక అధికారులు గైర్హాజరు కావడం, కొంతమంది ఆలస్యంగా హాజరు కావడంపై సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ, ఏపీఎం శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మొక్కలు నాటాలి..

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు మొక్కలు నాటాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు పూర్ణచందర్, ఆజాద్ చంద్రశేఖర్, విజయకుమారి, సంతోష్ పాల్గొన్నారు.

గుడుంబా తయారీ, విక్రయాలు మానుకోవాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: గుడుంబా నియంత్రణ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని, గుడుంబా తయారీ, విక్రయాలు మానుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్థావరాలపై శనివారం తెల్లవారుజాము నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తున్నట్లు తెలిసినా అమ్మినా వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. జిల్లా పరిధిలో 272 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 50 కిలోల నల్ల బెల్లం, 8,330 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసి 29 కేసులు నమోదు చేశారు.

న్యాయసేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి సరిత

చిన్నగూడూరు: సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉచిత న్యాయసేవా కేంద్రం తొర్రూర్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని తొర్రూర్ జడ్జి మట్ట సరిత అన్నారు. మండల న్యాయసేవ కమిటీ తొర్రూర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమ పథకాలు,నకిలీ విత్తనాలు,ఎరువులు గుర్తించుట తదితర అంశాలపై జడ్జి అవగాహన కల్పించారు. ఏఓ విష్ణు, ఎస్సై రుూన్సీ, ప్రజలు పాల్గొన్నారు.

సాగుకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

కేసముద్రం: సాగుకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్ పెరుమళ్లపెల్లి విజయ్ అన్నారు. మండలంలోని అమీనాపురం, కల్వల గ్రామాల్లో విద్యుత్‌శాఖ–పాలంబాట కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, దస్రూనాయక్, ఏడీఈ శ్రీనివాసులు, ఏఈలు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

గూడూరు: మండలంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని విద్యుత్ ఎస్ఈ నరేష్, డీఈ విజయ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండలంలోని అయోధ్యపురం, గూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈ హరిప్రసాద్, ఏడీఈ కవిత, ఏఏఓ రమేష్, ఏఈ అమ్ములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్ట్‌మాస్టర్‌ సస్పెన్షన్‌

ఖిలా వరంగల్‌ : వరంగల్‌ సబ్‌ డివిజన్‌ పరిధిలోని మొగిలిచర్ల బ్రాంచ్‌ పోస్ట్‌మాస్టర్‌ సున్నం శ్వేతపై సస్పెన్షన్‌ వేటు పడింది. తపాలాశాఖ ఖాతాకు జమ కావాల్సిన నగదును సొంత ఖర్చులకు వాడుకున్నట్లు పరిశీలనలో తేలింది. దీంతో శనివారం శ్వేతను సస్పెండ్‌ చేస్తూ వరంగల్‌ సౌత్‌ సబ్‌ డివిజన్‌ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ వర ప్రసాద్‌ ఉత్తర్వులు జారీ చేశారు. తపాలా శాఖ డబ్బులు తన సొంత అవసరాలకు ఉపయోగించిన తీరుపై విచారించనున్నట్లు తెలిపారు. విచారణ ముగిసే వరకు విధులకు దూరంగా ఉండాలని, అంతవరకు ఆమెను సస్పెన్షన్‌లో ఉంచామని ఆయన పేర్కొన్నారు. మొగిలిచెర్ల, రెడ్డిపాలెం, గోపాల్‌రెడ్డినగర్‌వాసులు సున్నం శ్వేతకు డిపాజిట్‌ డబ్బులు ఇవ్వరాదని, విచారణ పూర్తి అయ్యేవరకు ప్రజలు దేశాయిపేట సబ్‌ డివిజన్‌ ఆఫీసును ఉపయోగించుకోవాలని కోరారు.

మహానగర అభివృద్ధికి మరో పోరాటం

- వరంగల్‌, హనుమకొండ జిల్లాలను ఏకం చేయాలి



మాట్లాడుతున్న మాజీ మేయర్‌ రాజేశ్వర్‌రావు

నయీంనగర్‌ : గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వరంగల్‌ జిల్లాను ఆరు జిల్లాలను ఏర్పాటు చేసి అభివృద్ధిలో వెనుకపడేసిందని వరంగల్‌-హనుమకొండ జిల్లాల ప్రముఖులు విమర్శించారు. శనివారం హనుమకొండ ప్రెస్‌ క్లబ్‌లో వరంగల్‌ మహానగర పునఃనిర్మాణం-పరిపాలన సౌలభ్యం-అభివృద్ధి అనే అంశంపై పింగిళి సంపత్‌రెడ్డి అధ్యక్షతన చర్చ నిర్వహించారు. ఇందులో భాగంగా నగర ప్రముఖులు ప్రొఫెసర్‌ కూరపాటి వెంకటనారాయణ, మాజీ మేయర్‌ టి.రాజేశ్వర్‌రావు, సీనియర్‌ లాయర్‌ ఎం.సహోదర్‌రెడ్డి, గుడిమల్ల రవికుమార్‌, పుల్లూరు సుధాకర్‌, సోమ రామమూర్తి, సాయిని నరేందర్‌, రాజేంద్రప్రసాద్‌, యాదవ రెడ్డి, నర్సింగరావు తదితరులు మాట్లాడారు. కేసీఆర్‌ పాలనలో పరిపాలన సౌలభ్యం పేరుతో ఉమ్మడి వరంగల్‌ను కుట్రపూరితంగా విచ్ఛిన్నం చేసి ఉత్తర తెలంగాణ ఉద్యమ నాయకత్వాన్ని, రాజకీయ చైతన్యాన్ని దెబ్బతీశారని ఎద్దేవా చేశారు. గత పాలకుల ద్రోహాన్ని ప్రస్తుత పాలకులు సమీక్షించి వరంగల్‌, హనుమకొండ జిల్లాలను ఏకం చేసి అభివృద్ధి చేయాలని కోరారు. వరంగల్‌ కేంద్ర చారిత్రక ఆనవాళ్లు లేకుండా చేశారని, అభివృద్ధిలో హనుమకొండ 30వ స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహా నగరాలకు రావల్సిన జాతీయ స్థాయి నిధులు, సంస్థలు రాకపోవడంతో అభివృద్ధికి వెనుకబడిందని, వరంగల్‌ మహా నగరాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్ర సగ భాగం ప్రజలకు ఉపాధి కేంద్రంగా మారుతుందని తెలిపారు. వరంగల్‌ మహా నగరాన్ని కాపాడుకునేందుకు అన్ని రంగాలకు చెందిన వారిని ఏకం చేసి ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, రెండు జిల్లాల ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, టి.క్రాంతికుమార్‌, అరుణ, ప్రవీణ్‌కుమార్‌, నగేష్‌, సంగాని మల్లేశ్వర్‌, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణకు ప్రతీక.. బోనాలు

- రేపటినుంచి శ్రావణ మాసం షురూ
- ఉత్సవాల నిర్వహణకు సిద్ధం

శ్రావణ మాసం ప్రారంభంతో తెలంగాణ పల్లెల్లో బోనాల జాతర ప్రారంభమవుతుంది. ప్రతిఏటా సికింద్రాబాద్‌ ఉజ్జయినీ మహంకాళి బోనాలు ముగిసిన వారం రోజుల్లో జిల్లాలో పలు ప్రాంతాల్లో బోనాల సందడి నెలకొంటుంది. శ్రావణ మాసంలో వచ్చే ప్రతి బుధవారం, ఆదివారం రోజుల్లో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి పోచమ్మజాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.



కాజీపేటలో బోనాలతో వెళ్తున్న మహిళలు (ఫైల్‌)

కాజీపేట : బోనాల వేడుకకు గ్రామ దేవతల ఆలయాలు ముస్తాబవుతున్నాయి. బోనాల పండుగలో పోతురాజులు, శివసత్తులు, నెత్తిన బోనంతో మహిళల ఊరేగింపు, డప్పు వాయిద్యాల కేరింతలతో పండుగ సందడి సంతరించుకుంటుంది. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడానికి ఆదివారం నుంచి జాతర మొదలుకానుంది. తెలంగాణ జన జీవన ఆధ్యాత్మిక సందడిగా నిలుస్తున్న బోనాల జాతరపై సాక్షి ప్రత్యేక కథనం..

గ్రామ దేవతల అనుగ్రహం కోసం..

తెలంగాణ పల్లెల్లో ఆషాఢం, శ్రావణ మాసాల్లో బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తారు. ఏడుగురు గ్రామ దేవతలైనా పోచమ్మ, మైసమ్మ, బాలమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మ వీరికి తోడుగా గ్రామాన్ని కాపాడే పోతురాజు అనుగ్రహం కోసం ముత్తైదువులు బోనాలు సమర్పించి పూజలు చేస్తారు.

బోనం అంటే...

బోనం అంటే భోజనం. జానపదులు తమకు ఇష్టమైన గ్రామదేవతలకు సమర్పించే నైవేద్యం. దీన్ని కొత్త కుండలో వండి గ్రామదేవతలకు భక్తి ప్రపత్తులతో సమర్పిస్తారు. కడుముంతలో పానకం పోస్తారు. దానిపై దివ్వె పెట్టి బోనం జ్యోతి వెలిగించి జాతర కనుల పండవగా నిర్వహిస్తారు. బోనాల సమర్పణ వల్ల గ్రామ దేవతలు శాంతించి అంటు వ్యాధులు రాకుండా గ్రామాన్ని కాపాడతారని ప్రజల ప్రగఢ విశ్వాసం.

వేపాకువల్ల ప్రయోజనాలు..

గ్రామ దేవతలకు బోనం చేసిన, ప్రత్యేక పూజలు నిర్వహించిన పూర్వకాలం నుంచి వేపాకును వాడటం ఆనవాయితీ. వేపలో ఔషధ గుణాలు ఉంటాయని అభిప్రాయం. బోనాలు, పండుగ రోజుల్లో బంధువులు, మిత్రులు అధికంగా వచ్చే అవకాశం ఉండటం వల్ల పీల్చే గాలిలో తేడాలు వచ్చి అంటు వ్యాధులు ప్రబలే అస్కారం ఉంది. దీన్ని వేపకు పూర్తిగా నిరోధిస్తుందని పెద్దలు చెబుతుంటారు.

ఉత్సాహంగా వేడుకలు..

బోనాల జాతరకు పట్టణాల్లో స్థిరపడిన వారు వివిధ ప్రాంతాల్లోన వాసులు జాతరలో నాడు కుటుంబసమేతంగా పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువగా పోచమ్మకు బోనాలు చేయడం పిల్లపాపలతో చిలుకల బోనం, కల్లు కావాడీలు మోయిస్తారు. ఈ ఉత్సవాల్లో గ్రామదేవతలకు చెందిన ఆలయాల్లో కుమ్మరులు, రజకులు, పబ్బాలవాళ్లు పూజారులుగా వ్యవహారించడం ఆనవాయితీ.

గాంభీర్య రూపం.. సంప్రదాయ సౌరభం

కళ్లకు కాటుక.. కాళ్లకు గజ్జె.. మెలి తిరిగిన మీసాలు.. ఒంటినిండా బండారి.. మెడలో నిమ్మకాయల హారం.. చేతిలో ఈరగోలు.. డప్పుల దరువుకు నృత్యాలు.. ఇవన్ని కలగలిసిన గాంభీర్య ఆకారమే.. పోతరాజు. బోనాల ఉత్సవాల రథసారథి.. పోతరాజు లేకుండా బోనం ముందుకు జరగదంటే అతిశయోక్తి కాదు.



పోతరాజుల నృత్యాలు (ఫైల్‌)

శివపార్వతుల సంతానంగా చరిత్ర చెబుతున్న ఏడుగురు అక్కలకు ముద్దుల తమ్ముడే పోతరాజు. అక్కలకు రక్షణగా ఉంటూ ఊరి పొలిమేరను కాపాడుతుంటాడని చెబుతారు. పోతరాజును పోత లింగన్న, ద్వార పాలకుడు, రథసారథి అని వివిధ పేర్లతో పిలుస్తుంటారు. తన సోదరి నల్లపోచమ్మను ఓ వ్యక్తి చెరబట్టడానికి ప్రయత్నించగా తీవ్ర ఆగ్రహానికి గురైన పోతరాజు అతని గొంతు కొరికి చంపుతాడని, తిరిగి తన సోదరి ఆజ్ఞ మేరకు అతడిని బతికిస్తాడని ప్రతీతి.

ఈర గోలతో కొడితే దుష్టశక్తులు దూరం..

బోనాల ఉత్సవాల్లో అమ్మవారి ఆలయాల వద్ద పోతరాజులను శాంతింపజేయడానికి గుమ్మడికాయ లేదా సొరకాయను గావు పట్టడానికి ఇస్తారు. దశాబ్దాల క్రితం దున్నపోతులు, మేకపోతులు, కోడిపుంజులను పోతరాజులు గావు పట్టేవారని పెద్దలు చెబుతుంటారు. జంతు బలుల నిషేధం తర్వాత అనేక ప్రాంతాల్లో గుమ్మడికాయ, సొరకాయతోనే గావు పడుతున్నారు. పోతరాజుల చేతుల్లో ఉండే ఈర గోలతో కొడితే దుష్టశక్తులు దరిచేరవని ప్రజల విశ్వాసం. పోతరాజు శరీరంపై నిండుగా ఉండే బండారి (పసుపు)ను బొట్టుగా పెట్టుకుంటారు. నెల రోజుల పాటు ప్రతి బుధవారం, ఆదివారం గ్రామ దేవతగా పిలువబడే చల్లని తల్లి పోచమ్మ ఉత్సవాల్లో పోతరాజుల హడావిడి అంతా ఇంతా కాదు.

పరిశ్రమల ఖిల్లాగా మారుస్తాం..



కారిడార్‌ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, చిత్రంలో వరంగల్‌ ఎంపీ కడియం కావ్య, మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్‌ రాహుల్‌శర్మ

- రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం
- రోడ్ల నిర్మాణానికి రూ.97 కోట్లు ఇచ్చాం
- మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల, సీతక్క

భూపాలపల్లి /భూపాలపల్లి అర్బన్‌ /గణపురం : అన్ని వనరులు ఉన్న భూపాలపల్లి జిల్లాను పరిశ్రమల ఖిల్లాగా మారుస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గణపురం మండలంలోని గాంధీనగర్‌ వద్ద వన మహోత్సవంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఇండస్ట్రియల్‌ కారిడార్‌పార్క్‌ పనులను వారు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నియోజకవర్గానికి ఒకటి మిని పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, జిల్లాకు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ..భూపాలపల్లి నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.97 కోట్ల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. ధరణి సమస్యలను తొలగించేందుకు భూమాత తీసుకొచ్చామన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కోరిన ఎమ్మెల్యే..

మైలారం వద్ద ఇండస్ట్రియల్‌ పార్కు పనుల ప్రారంభోత్సవ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడారు. రామప్ప నుంచి డీబీఎం-38 కాల్వకు లింక్‌ చేసి మూడు టీఎంసీల సాగునీరు అందించాలని, తద్వారా 44,700 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇందుకోసం రూ.270 కోట్లతో డీపీఆర్‌ సిద్ధంగా ఉందని, ప్రభుత్వం అనుమతించి నిధులు మంజూరు చేయాలని మంత్రులను కోరారు.



ఔషధ గిడ్డంగిని ప్రారంభిస్తున్న మంత్రులు

నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని రాష్ట మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అనసూయ(సీతక్క) సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రూ.3.60 కోట్లతో నిర్మించిన ఔషధాలు భద్రపరచు గోదాం, రూ.27లక్షలతో నిర్మించిన వైద్యాధికారుల క్యాంటీన్‌ను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే సత్యనారాయణరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో రోగ నిర్ధారణకు సిటీ స్కాన్‌ ఎంఆర్‌ఐ, ప్రొఫెసర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, టీజీఐఎస్‌ఎస్‌ చైర్‌ పర్సన్‌ నిర్మలాజగ్గారెడ్డి, ట్రేడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఐత ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్‌ రాహుల్‌ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, కాంగ్రెస్‌ రాష్ట అధికార ప్రతినిధి అశోక్‌ పాల్గొన్నారు.

గూడ్స్‌ రైలు బ్రేక్‌ లాక్‌

కాజీపేట రూరల్‌ : కాజీపేట రైల్వే డీజిల్‌ లోకోషెడ్‌ సమీపంలో మెయిన్‌ లైన్‌లో శనివారం గూడ్స్‌ రైలు బ్రేక్‌లు లాక్‌ అయి రైలు నిలిచిపోయింది. రైల్వే కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్‌ నుంచి కాజీపేట జంక్షన్‌కు వెళ్తున్న గూడ్స్‌ రైలు మార్గమధ్యలో డీజిల్‌ షెడ్‌ వద్దకు రాగానే గూడ్స్‌ రైలు వీల్స్‌కు బ్రేక్‌లు లాక్‌ కావడంతో బ్రేక్‌ బైండింగ్‌ సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. దీంతో సమాచారం అందుకున్న మెకానిక్‌ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వీల్స్‌లో ఏర్పడ్డ సాంకేతిక సమస్యను పరిష్కరించారు. దీంతో ఉదయం కాజీపేట జంక్షన్‌లో సిర్‌పూర్‌కాగజ్‌నగర్‌-సికింద్రాబాద్‌ వెళ్లే భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ 20 నిమిషాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ ఎంపిక

వరంగల్‌ స్పోర్ట్స్‌ : హనుమకొండ జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో నేడు (ఆదివారం) వరంగల్‌ జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ ఎంపిక నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్‌ సంఘం జిల్లా అధ్యక్షుడు మూగల కుమార్‌ యాదవ్‌ శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్‌-14, 16, 18, 20 బాలబాలికలతో 23 సంవత్సరాల సీనియర్లకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. క్రీడాకారుల వయస్సు అండర్‌-14 బాలబాలికలు 2010,ఆగస్టు 8 నుంచి 2012,ఆగస్టు 7వ తేదీ మధ్య జన్మించిన వారు, అండర్‌-16, 2008, ఆగస్టు 8నుంచి 2010,ఆగస్టు 7వ తేదీ మధ్య జన్మించిన వారు, అండర్‌-18 క్రీడాకారులు 2006, ఆగస్టు 8నుంచి 2008 ఆగస్టు 7 మధ్య జన్మించిన వారు, అండర్‌-20 బాలబాలికలు 2004 ఆగస్టు 8 నుంచి 2004 నుంచి ఆగస్టు7వ తేదీ మధ్య, 23 సంవత్సరాల కేటగిరీలో 2024 ఆగస్టు 10 వరకు 23 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో జేఎన్‌ స్టేడియం వద్ద హాజరు కావాలని వివరించారు. ఇతర పూర్తి వివరాలకు యుగేందర్‌ రెడ్డి 98665 64422, మహేందర్‌ 96188 28299 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- సైయంట్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ మోహన్‌రెడ్డి
- ఎస్సార్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్‌ డే

హసన్‌పర్తి : ప్రతి విద్యార్థి పారిశ్రామిక వేత్తగా ఎదిగి..మరికొందరికి ఉపాధి కల్పించాలని సైయంట్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ బి.వి.ఆర్‌ మోహన్‌రెడ్డి సూచించారు. ఎస్సార్‌ యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్‌ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యాసంస్థలు-పరిశ్రమల మధ్య అవగాహన ఎంతో అవసరమన్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు సాధ్యమన్నారు. దివంగత రాష్ట్రపతి డాక్టర్‌ అబ్దుల్‌ కలాం నూతన ఆలోచనలతో 'మిసైల్‌ మ్యాన్‌'గా గుర్తింపు పొందినట్లు గుర్తు చేశారు. తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో కంపెనీలు నెలకొల్పినట్లు చెప్పారు. వరంగల్‌లోని మడికొండలో సైయంట్‌ కంపెనీ స్థాపించినట్లు తెలిపారు. ఇక్కడ ఎంతో మంది విద్యార్థులు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. విలువలతో కూడిన సాంకేతికతతో అమెజాన్‌, అపిల్‌, మైక్రోసాఫ్ట్‌ వంటి సంస్థలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. క్లౌడ్‌ కంప్యూటరింగ్‌ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవలు పొందనున్నట్లు వివరించారు.



విద్యార్థికి పట్టా అందజేస్తున్న ఎస్సార్‌ విద్యాసంస్థల చైర్మన్‌ వరదారెడ్డి, సైయంట్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ మోహన్‌రెడ్డి

తల్లిదండ్రులను గౌరవించాలి: తనికెళ్ల భరణి

విద్యార్థులు తమ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని సినీ కళాకారుడు తనికెళ్ల భరణి సూచించారు. జీవితంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలన్నారు. ఎస్సార్‌ యూనివర్సిటీ చాన్స్‌లర్‌ ఎ.వరదారెడ్డి 2002లో ఇంజనీరింగ్‌ విద్యతో ప్రారంభించిన కళాశాల నేడు యూనివర్సిటీ స్థాయికి ఎదిగిందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు డాక్టరేట్‌, డిగ్రీ పట్టాలు అందించి, పూర్వ విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సార్‌ యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ దీపక్‌ గార్గ్‌, మధుకర్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ అర్చనారెడ్డి, కోర్‌ కమిటీ సభ్యులు డాక్టర్‌ మహేష్‌, రామ్‌దేశ్‌ ముఖ్‌, సుమన్‌ కుమార్‌, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ నటుడు తనికెళ్ల భరణి, సైయంట్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ మోహన్‌రెడ్డి

ఐదేళ్లకే.. నూరేళ్లు నిండాయా బిడ్డా..

- పాముకాటుతో చిన్నారి మృతి
- ఇబ్రహీంపూర్‌లో విషాదం



రుద్రాక్షి (ఫైల్‌)

రఘునాథపల్లి : అంగన్‌వాడీకి వెళ్లే అభం, శుభం తెలియని చిన్నారి పాముకాటుకు బలైంది. నాయనమ్మతో కలిసి నిద్రపోయిన ఆమెకు అదే శాశ్వత నిద్రగా మిగిలిపోయింది. ఐదేళ్లకే.. నూరేళ్లు నిండాయా బిడ్డా.. అంటూ కన్నవారి రోదన గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో శనివారం తెల్లవారు జామున ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గన్నోజు మధు-లాస్య దంపతులకు ఐదేళ్ల కూతురు రుద్రాక్షి (5), ఏడాదిన్నర బాబు ఉన్నారు. చిన్నారి రుద్రాక్షికి రోజు నాయనమ్మ వద్ద పడుకునే అలవాటుంది. శుక్రవారం రాత్రి కూడా నాయనమ్మ ఇంటికి వచ్చి మంచంపై పడుకున్నారు. అర్ధరాత్రి తనపై ఏదో పారుతున్నట్లు అనిపించడంతో రుద్రాక్షి నిద్రలేచింది. ఒంటిపై నుంచి పాము వెళ్తుండగా చూసింది. అప్పటికే పాము కాటు వేయడంతో నాయనమ్మ పాము అంటూ అరిచి ఏడుస్తోంది. నాయనమ్మ లేచి చూసేసరికి పాము వెళ్తుండడాన్ని గుర్తించి పాము పాము అంటూ అరిచి భర్త కొమురయ్యను లేపింది. భర్త, చిన్నారి తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి పాము కనిపించలేదు. వెంటనే చిన్నారిని జనగామలోని ఆస్పత్రికి తీసుకెళ్లిన ఫలితం దక్కలేదు. చికిత్స చేస్తుండగా కొద్దిసేపటికే చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పాము కాటుతో చిన్నారి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఇబ్రహీంపూర్‌ చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

రూ.1.77 లక్షల విలువైన గంజాయి పట్టివేత

స్టేషన్‌ఘన్‌పూర్‌ : జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కాడు. అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్‌ జోన్‌ డీసీపీ బి.రాజమహేంద్రనాయక్‌ మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. స్థానిక రైల్వే స్టేషన్‌ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న దాదాపు 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలోని బదలాపూర్‌ జిల్లా కదోడ్‌వాడికి చెందిన డెకరేషన్‌ పనులు చేసే మనోహర్‌ భగవాన్‌ సావర్‌, ఏపీలోని తుని నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్ర, హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. అలా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తాడని డీసీపీ చెప్పారు. ఈ క్రమంలోనే తుని ప్రాంతానికి చెందిన సుమన్‌ వద్ద 7.1 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, రైలులో కాజీపేటకు చేరి అక్కడ విక్రయించే ప్రయత్నం చేశాడు. కాగా కాజీపేటలో ఎవ్వరూ కొనుగోలు చేయకపోవడంతో హైదరాబాద్‌లో విక్రయించేందుకు శుక్రవారం కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ రైలు ఎక్కాడు. అయితే రైలులో జీఆర్‌పీఎఫ్‌ పోలీసులను చూసి భయంతో ఘన్‌పూర్‌లో దిగి స్టేషన్‌ బయటికి వచ్చాడు. కాగా అదే సమయంలో అక్కడ వాహనాల తనిఖీ చేస్తున్న స్టేషన్‌ ఘన్‌పూర్‌ సీఐ ముస్క రాజు, ఎస్సై బొల్లం వినయ్‌కుమార్‌, పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న నిందితుడి గమనించి అతడిని అదుపులో తీసుకున్నారు. అనంతరం అతడిని తనిఖీ చేయగా రూ.1,77,500 విలువైన 7 కిలోల100 గ్రాముల గంజాయి లభ్యమైంది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించి విచారించారు. గంజాయితో పాటు మొబైల్‌ను స్వాధీనం చేసుకుని శనివారం అరెస్టు చూపి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

విద్యుత్‌ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ ఎన్నిక వాయిదా

- ఎన్నికలు నిర్వహించేందుకు నామినేషన్ల స్వీకరణ
- అభ్యంతరాల నేపథ్యంలో రద్దు
- 20న ఎన్నికలు



హన్మకొండ : విద్యుత్‌ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ సభ్యుల ఎన్నిక శనివారం నిర్వహించగా గందరగోళం మధ్య వాయిదా పడింది. నెలకొంది. స్పోర్ట్స్‌ కౌన్సిల్‌లో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని ఎన్పీడీసీఎల్‌ హనుమకొండ ఎస్‌ఈ చైర్మన్‌గా, హనుమకొండ సర్కిల్‌ డీఈ టెక్నికల్‌ కన్వీనర్‌గా, హనుమకొండ సర్కిల్‌ సీనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ కోశాధికారిగా, వరంగల్‌, జనగామ, మహబూబాబాద్‌, భూపాలపల్లి ఎస్‌ఈలు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు క్రీడాకారుల నుంచి ముగ్గురిని ఎన్నుకోవాలని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండలోని డిప్లొమా ఇంజనీర్స్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో శనివారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 2014 నుంచి విద్యుత్‌ సంస్థలు నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్న వారిలో 100 మంది క్రీడాకారులు చేరుకున్నారు. ముందుగా సమావేశం నిర్వహించి అధికారులు ఎన్నికల నిర్వహణపై వివరించారు. వరంగల్‌ సర్కిల్‌ డీఈ టెక్నికల్‌ ఎ.ఆనందం ఎన్నికల అధికారిగా నిర్వహించగా ఆయన పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి నామినేషన్లు స్వీకరించారు. ముగ్గురు సభ్యులకు గాను ఆరుగురు నామినేషన్లు వేయగా పి.రాజు ప్రసాద్‌, కె.నర్సింహారెడ్డి ఉపసంహరించుకున్నారు. వి.సునిల్‌ కుమార్‌, యాకూబ్‌ పాషా, ఇ.ప్రేమ్‌ కుమార్‌, మొగిలి అనిల్‌ కుమార్‌ రెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడి వరకు సజావుగా సాగిన ఎన్నికల ప్రక్రియలో తర్వాత గందరగోళం చోటుచేసుకుంది. పోటీలో ఉన్న ఓ అభ్యర్థితో పాటు పలువురు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎన్నిక వివాదస్పదం కానుండడంతో ఎస్‌ఈలు అందరు చర్చించి వాయిదా వేయాలని నిర్ణయించారు. చివరకు ఎన్నికలు వాయిదా వేసి, 20వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్‌ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌కు ఈ నెల 20వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ కౌన్సిల్‌ కన్వీనర్‌ విజేందర్‌ రెడ్డి తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ఎన్పీడీసీఎల్‌ వరంగల్‌ సర్కిల్‌ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ, 16న పరిశీలన, 17న ఉపసంహరణ, అదేరోజు సాయంత్రం 5 గంటలకు బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రదర్శిస్తారు.20న హనుమకొండ సర్కిల్‌ కార్యాలయం ఆవరణలోని స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్‌ జరుగుతుందని, అనంతరం కౌంటింగ్‌ చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.